


ఎన్నికల లీల

మిత్రులు శత్రువులై.. శత్రువులు మిత్రులై..

'రాజకీయాలలో శాశ్వత శత్రువులు గానీ, శాశ్వత మిత్రులుగానీ ఉండరు' అనేది నానుడి. ఈ నానుడి గూడూరు నియోజకవర్గంలో నిజమైంది. 2019 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్, వైసీపీ అభ్యర్థిగా వెలగపల్లి వరప్రసాదరావు తలపడ్డారు.పోటాపోటీగా సాగిన ప్రచారాల్లో మాటలకత్తులు దూసుకున్నారు. విజయం వరప్రసాదరావునే వరించింది. అయితే ఈయనకు ఈసారి వైసీపీ టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.గూడూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఈసారి కూడా పాశిం సునీల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. గతంలో బరిలో తలపడ్డ ఈ ఇద్దరూ ఈసారి మిత్ర కూటమి అభ్యర్థులు కావడంతో, కలిసిమెలిసి ఒకరి గెలుపు కోసం మరొకరు ప్రచారం చేయబోతున్నారు. అలాగే 2021 ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపు కోసం కృషి చేసిన వరప్రసాదరావు, ఈసారి ఆయనకే ప్రత్యర్థిగా మారి సవాలు చేస్తున్నారు.

- గూడూరు

రోజాకు అసమ్మతి వర్గం ఆఖరి ఝలక్!

సహకరించబోమని సజ్జల సమక్షంలో తేల్చి చెప్పేసిన నాయకులు

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరిలో రోజా గెలుపునకు సహకరించే ప్రసక్తే లేదని ఆ నియోజకవర్గ వైసీపీ అసమ్మతి నేతలు అధిష్ఠానానికి తమ చివరి మాటగా తేల్చి చెప్పేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచీ పిలుపు రావడంతో సోమవారం రాత్రి శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, నిండ్ర మండల నేత రెడ్డివారి భాస్కర రెడ్డి, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, ముఖ్యనేత రవి శేఖర రాజు, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి, విజయపురం మండల నేత లక్ష్మీపతి రాజు తదితరులు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎం కార్యదర్శి ధనంజయరెడ్డిలతో సమావేశమయ్యారు. రోజా నుంచీ తాము ఎదుర్కొన్న ఇబ్బందులను, వేధింపులను ఏకరువు పెట్టారు. ఓపిగ్గా విన్న సజ్జల, ధనుంజయ రెడ్డి ఈసారికి తమ ముఖం చూసి రోజా గెలుపునకు సహకరించాలని సూచించినట్లు తెలిసింది. అయితే తాము పనిచేసినా రోజా గెలిచే పరిస్థితే లేదని వారు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ దశలో హఠాత్తుగా గదిలోకి మంత్రి రోజా, ఆమె భర్త సెల్వమణి వచ్చారని, అసమ్మతి నేతలకు నమస్కరించి పలకరించినా వారు స్పందించలేదని అంటున్నారు. ఈ రెండు వర్గాలనూ విడివిడి గదుల్లో ఉంచి సజ్జల, ధనుంజయరెడ్డి మంతనాలు జరిపినట్లు తెలిసింది. చివరికి అసమ్మతి నేతలు మాత్రం, తాము వద్దన్నా రోజాకే టికెట్ ఇచ్చారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెకోసం తాము ఎన్నికల్లో పనిచేయమని తేల్చి చెప్పి వెనుదిరిగారని చెబుతున్నారు. దీంతో నగరి వైసీపీలో మంత్రి రోజాకు, ఆమె వ్యతిరేక వర్గానికీ నడుమ సయోధ్య కుదిరే అవకాశాలు ఇక లేవని తేలిపోయింది. దీంతో అసమ్మతి వర్గం నేతలు తదుపరి ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

చిన్నారులతో వైసీపీ ప్రచారం



ఏర్పేడు మండలం మోదుగులపాళెం పంచాయతీలో మంగళవారం వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.చిన్నారులకు కూడా వైసీపీ కండువాలు కప్పి జెండాలు పట్టించి ప్రచారంలో వాడుకోవడంపై జనం తిట్టుకున్నారు.

- ఏర్పేడు

తిరుమలలో హీరో రామ్‌చరణ్



శ్రీవారి దర్శనార్థం హీరో రామ్‌చరణ్ భార్య ఉపాసన,కుమార్తె క్లీంకారతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. ఫీనిక్స్(శ్రీవేంకటేశ్వర నిలయం) అతిథిగృహానికి రాత్రి 7.30 గంటలకు చేరుకున్న వారికి స్థానిక అభిమానులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాంచరణ్ దంపతులు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావా?

- నీళ్లే ఇవ్వకుండా సెట్టింగులతో డ్రామాలా?
- సీఎం జగన్‌పై చంద్రబాబు విమర్శ
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో హంద్రీ నీవాకు నీళ్లిస్తామని హామీ





నీళ్లులేని హంద్రీ నీవా కాలువలో కబడ్డీ ఆడుతున్న టీడీపీ శ్రేణులు.. - రాజుపేట వద్ద గేటు కింద చూస్తున్న చంద్రబాబు



కాలువలో నడిచి వస్తున్న చంద్రబాబు

రామకుప్పం/వి.కోట, మార్చి 26: కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావని రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేసుకుని తిరిగావంటూ సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శ చేశారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ నీవా కాలువను మంగళవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను సీఎంగా ఉండి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 90 శాతం చేపట్టి వి.కోట వరకు నీళ్లు తెచ్చా. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయకుండా సినిమా సెట్టింగులతో కుప్పానికి నీళ్లిచ్చామని ప్రజలను మభ్యపెట్టారు. నీతి, నిజాయితీకి మారుపేరైన కుప్పం ప్రజలను నీటి డ్రామాతో మోసగించడానికి మనసెలా వచ్చింది' అంటూ సీఎంను ప్రశ్నించారు. ఇలాంటి డ్రామా లు కుప్పం ప్రజలు నమ్మరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కుప్పానికి హంద్రీ, నీవా ద్వారా పూర్తి స్థాయిలో నీరిచ్చి అన్ని చెరువులను నింపుతామని హామీ ఇచ్చారు. 'నాడు తాను అమలు చేసిన ఇజ్రాయెల్ తరహా బిందుసేద్యం ప్రాజెక్టును.. తండ్రి (వైఎస్) ఆపేశారు. నేడు కొడుకు (జగన్) వచ్చి కుప్పాన్ని సర్వ నాశనం చేయడమే కాకుండా, సంపదను కొల్లగొట్టారు' అంటూ పోల్చి చెప్పారు. 'నేను కుప్పం కంటే ముందే పులివెందులకే నీళ్లిచ్చా. అది నీకు.. నాకు ఉన్న తేడా. నీతో పాటు నీ అనుచరవర్గం కుప్పంలో దౌర్జన్యాలు, అక్రమాలు చేస్తున్నారనడానికి నిదర్శనం గుండిశెట్టిపల్లె సమీపంలోని బసవేశ్వరస్వామి భూములను కొట్టేయాలని చూడటమే. ఇలాంటివి ఎప్పటికీ జరగనివ్వను' అని చంద్రబాబు స్పష్టంచేశారు. గుడుపల్లె మండలం యామిగానిపల్లె వద్ద రూ.364 కోట్లతో.. శాంతిపురం మండలం మాదనపల్లె వద్ద రూ.170 కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణానికి పనులు మంజూరు చేశామన్నారు. ఇప్పుడు వీళ్ల మంజూరు చేసినట్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా అని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాగా, రాజుపేట వద్ద 15-20 అడుగుల లోతున్న హంద్రీ నీవా కాలువలోకి చంద్రబాబు దిగారు. దిగేటప్పుడు.. మళ్లీ ఎక్కేటప్పుడు సెక్యూరిటీ సిబ్బంది, నాయకులు సాయం అందించేందుకు ప్రయత్నించినా ఆయన అంగీకరించలేదు. 74 ఏళ్ల వయసులోనూ ఆయన ఉత్సాహంగా కాలువలోకి దిగి పరిశీలించారు.

నేడు పుత్తూరులో ప్రజాగళం సభ

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం పేరిట పర్యటనలకు నేటినుంచీ శ్రీకారం చుడుతున్నారు. పలమనేరులో బుధవారం ఉదయం 11 నుంచీ మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ప్రజాగళం తొలి బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఆపై గంట పాటు విశ్రాంతి తీసుకుని పుత్తూరు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4గంటల దాకా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కాపువీధి జంక్షన్‌లో జరిగే సభలో పాల్గొంటారు.సాయంత్రం 5 గంటలకు మదనపల్లెకు చేరుకుని బెంగుళూరు బస్టాండు కూడలిలో 5.30 నుంచీ 7.30గంటల వరకూ బహిరంగసభలో పాల్గొంటారు. పుత్తూరు సభకు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో సీజేఐ

నేడు శ్రీవారి దర్శనం

శ్రీకాళహస్తి/తిరుచానూరు/తిరుమల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.సాయంత్రం 6గంటలకు ఆలయానికి చేరుకున్న ఆయన 7.30గంటల దాకా అక్కడే గడిపారు.అనంతరం తిరుచానూరు చేరుకున్న ఆయన పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సహా పలువురు న్యాయమూర్తులున్నారు.ఆలయ వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం తిరుమల బయల్దేరిన సీజేఐ రచన అతిథిగృహానికి రాత్రి 10.30 గంటలకు చేరుకున్నారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి, సీవీఎస్వో నరసింహకిషోర్ స్వాగతం పలికారు. అంతకుముందే ఏపీ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా తిరుమలకు చేరుకున్నారు. వీరు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టాస్క్‌ఫోర్సు ఎస్పీకి బంగారు పతకం

- జిల్లాలో 28మందికి డీజీపీ పతకాలు

తిరుపతి క్రైం, మార్చి 26 : జిల్లావ్యాప్తంగా 28మంది పోలీసు అధికారులకు,సిబ్బందికి డీజీపీ పతకాలు ప్రకటించారు.బంగారు పతకాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ప్రదానం చేయనున్నారు. వీరితో పాటు 20మందికి కాంస్య పతకాలు ప్రకటించారు. వీరిలో డీఎస్పీ బాబురెడ్డి, సీఐ వెంకటేశ్వరరెడ్డి, వడమాల పేట ఎఎస్ఐ రామకృష్ణారెడ్డి, పెళ్లకూరులో పనిచేస్తున్న షేక్ అబ్దుల్ రహీమ్, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపీకృష్ణ, డీఎస్ఆర్‌బీ కానిస్టేబుల్ చెంగల్ రెడ్డి, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ రెడ్డిమోహన్, సైబర్ క్రైంలో పనిచేస్తున్న లక్ష్మయ్యకార్తీక్, మునిరామయ్య, పుత్తూరులో పనిచేస్తున్న రమేష్, తిరుపతి టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ భాస్కరనాయక్, దిశ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆర్‌కెఎం ఆషా, వెంకటగిరి 9వ బెటాలియన్‌లో ఏఆర్ఎస్ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ ఎ. శంకరయ్య, మునెయ్య, కానిస్టేబుల్ రోశయ్య ,టాస్క్‌ఫోర్సులో పనిచేస్తున్న హరిబాబు, పోలీసు శిక్షణా కళాశాలలో ఏఆర్ఎస్‌గా పనిచేస్తున్న ఎన్.విజయ, ఎస్ఐ శ్రీనివాసులు, ఇంటెలిజెన్సు విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సోమశేఖర్‌లకు డీజీపీ కాంస్య పతకాలు ప్రకటించారు. వీరితో పాటు రజత పతకాలను ఏడుగురికి ప్రకటించారు.తిరుపతి ఎస్పీగా పనిచేసి బదిలీ అయిన మల్లిక గార్గ్, దిశ ఏఎస్ఐ ప్రసాద్‌రాజు, గూడూరు రూరల్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు, కేవీబీపురంలో కోర్టు కానిస్టేబుల్ దామోదరం, తిరుపతి రిజర్వు పీసీ చంద్రశేఖర్, ఏపీఎస్పీ 9వ బెటాలియన్‌లో పనిచేస్తున్న వరంధామయ్య, ఆర్ఎస్ఐ వై.జాలయ్య వీరిలో ఉన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగి తొలగింపు



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పరశురాం

తిరుపతి(కలెక్టరేట్)/కేవీబీపురం, మార్చి 26: కేవీబీపురం మండలం కాళంగి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టు ప్రాతిపదికన క్షేత్రసహాయకుడిగా పనిచేస్తున్న పరశురామ్‌ను విధుల నుంచి తొలగించారు.ఆదరం, కాళింగి గ్రామాల్లో ఓమవారం జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అతన్ని విధుల నుంచి తొలగించారు.

బయటపడ్డ వైసీపీ బండారం

పార్టీ ప్రచార సామగ్రి వున్న గోదాము సీజ్



ప్రచారానికి ఉపయోగించే ఎలక్ట్రికల్ స్పీకర్ బాక్స్‌ను చూస్తున్న ఎన్నికల అధికారి సి.టి. సలోమి, టీడీపీ నాయకుడు నరసింహ యాదవ్ తదితరులు

రేణిగుంట, మార్చి 26 : ఓటర్లకు పంచేందుకు వైసీపీ నాయకులు తెప్పించిన కానుకలను, ప్రచార సామగ్రిని నిల్వ చేసిన గోదామును ఎట్టకేలకూ అధికారులు సీజ్ చేశారు.'గోదాముల్లో వైసీపీ ప్రచార సామగ్రి నిల్వ' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై ఎన్నికల అధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో గోదాములను పరిశీలించేందుకు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిణి సొలోమి ఇద్దరు కానిస్టేబుళ్లతో వెళ్లారు. వీరి రాకను గమనించిన గోదాము సిబ్బంది పలాయనం చిత్తగించగా బయట ఉన్న వైసీపీ సామగ్రి కలిగిన వాహనాన్ని నిలిపివేశారు.గోదాము లోపల ఏముందో తేలాలంటూ టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కృష్ణ యాదవ్, చంద్రశేఖర రెడ్డి, మెహబూబ్ బాషా, కన్నన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ తమకేమీ సంబంధం లేనట్టుగా ఉన్నారంటూ పోలీసులపై, అధికారులపై మండిపడ్డారు. టీడీపీ రాష్ట్ర విభాగం ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదలిపెట్టదని హెచ్చరించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అక్కడే బైఠాయించి నిరసన తెలియజేశారు.సీఐలు సుబ్బరాయుడు, మల్లికార్జున్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, తహసిల్దార్ నాగేశ్వరరావు వాహనంలో ఉన్న మూటలను కిందకు దించి అందులో ఏముందో చూపించారు.గొడుగులు, కండువాలు, బొట్టు బిల్లలు, రిస్ట్‌వాచీలు, ఈవీఎం నమూనాలు, టోపీలు, బ్యాడ్జీలు, వైసీపీ జెండాలు ఉన్నట్టు గుర్తించారు.తనిఖీలకు వచ్చిన సొలోమికి జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేతనుంచి తీవ్ర ఒత్తిడి వచ్చినట్టు తెలిసింది. దీంతో ఆమె గోదామును పరిశీలించేందుకు తొలుత వెనకడుగు వేశారు. టీడీపీ నాయకుల ఆందోళనతో గోదాములోని వస్తువులను ఎట్టకేలకు పరిశీలించి సీజ్ చేశారు.

ప్రచార సామగ్రి సీజ్ చేసేవరకూ కదిలేది లేదు

- అర్ధరాత్రి గోదాముల వద్ద పులివర్తి నానీ బైఠాయింపు



వైసీపీ ప్రచార సామగ్రిని పరిశీలిస్తున్న నానీ తదితరులు

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు గోదాముల్లో నిల్వ వుంచిన వైసీపీ ప్రచార సామగ్రిని సీజ్ చేసేవరకూ కదిలేది లేదంటూ చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ సంబంధిత గోదాముల వద్ద మంగళవారం అర్ధరాత్రి బైఠాయించారు. మొత్తం మూడు గోదాములుండగా అధికారులు కేవలం ఒక గోదాము మాత్రమే తెరిచి సామగ్రి పరిశీలించారని, మిగిలిన రెండు గోదాములను తెరవలేదని ఆరోపించారు. తెరిచిన గోదాములో కూడా వస్తువులను సీజ్ చేయలేదని, పంచనామా చేయలేదని, గోదాముకు సీల్ కూడా వేయలేదని ఆరోపించారు. రేణిగుంట తహసిల్దారు నాగేశ్వరరావు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, గోదాముకు తాళం మాత్రం వేసుకుని వెళ్ళారని ఆరోపించారు. ఆ గోదాముకు వెనుక తలుపు తెరిచే వుందన్నారు. మొత్తం రూ. 30 కోట్ల విలువైన ఎన్నికల ప్రచార సామగ్రి గోదాముల్లో నిల్వ వుంచారని ఆరోపించారు. గోదాముల్లో వున్న సామగ్రిలో వాచీలు, స్పీకర్లు, చీరలు వంటి పలు వస్తువులు ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఉద్దేశించినవేనన్నారు. ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకోవాలని, గోదాములోని వైసీపీ ప్రచార సామగ్రిని ఆ పార్టీ ఎన్నికల వ్యయం కింద, అలాగే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి ఎన్నికల వ్యయం కింద నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారిద్దరినీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : సా. 6.27

సహరి (గురువారం) : ఉ. 4.52

కోడ్ ఉల్లంఘన కాదా..?

● సిమెంట్ బల్లలపై అలాగే ఉన్న ఎమ్మెల్యే పేరు


మల్లంగుంటలో ముత్యాలమ్మగుడి వద్ద ఎమ్మెల్యే పేరుతో ఉన్న సిమెంటు బల్లలు

తిరుపతి రూరల్, మార్చి26: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పదిరోజులు గడిచినా మల్లంగుంట గ్రామంలో ముత్యాలమ్మ గుడి ముందు తుడా నిధులతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుపై ఉన్న సిమెంటు బెంచీలు అలాగే దర్శనమిస్తున్నాయి. చెవిరెడ్డి పేరు అలాగే ఉంచడంపై అటువైపు వెళ్లే జనాలు, గుడికి వచ్చే భక్తులు చూసి వీటికి కోడ్ వర్తించదా..ఇది కోడ్ ఉల్లంఘన కాదా అని చర్చించుకుంటున్నారు. కోడ్‌ని పక్కాగా అమలు చేసేందుకు టీమ్‌లను ఏర్పాటు చేసినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేవాలయాలకు వైసీపీ స్టిక్కర్లు


కొత్తఇండ్లులో వినాయకస్వామి దేవాలయానికి అంటించిన వైసీపీ స్టిక్కరు

చంద్రగిరి, మార్చి 26: వైసీపీ ప్రచారంలో భాగంగా చంద్రగిరి మండలంలోని దేవాలయాలకు, బడులకు వైసీపీ స్టిక్కర్లు అంటిస్తుండటంతో గ్రామస్తులు విస్తుపోతున్నారు. కొత్తఇండ్లులో వైసీపీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ బలవంతంగా వైసీపీ స్టిక్కర్ అంటించారు. అదే క్రమంలో దేవాలయాలకు అంటించేశారు. దీనిపై గ్రామస్తులు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశారు.

తలకోన నీటితో రెండు మండలాలను సస్యశ్యామలం చేస్తా : నాని


నానీని సన్మానించిన కమిటీ సభ్యులు

ఎర్రావారిపాలెం, మార్చి 26: టీడీపీ అధికారంలోకి వచ్చాక తలకోన డ్యాం నిర్మించి రెండు (ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు) మండలాలను సస్యశ్యామలం చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. తలకోన నీరు సద్వినియోగ సాధన కమిటీ సభ్యులు మంగళవారం నానీని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేషాచలం అడవుల్లో నుంచి ఎన్నో సెలయేరులతో పింఛా నదిలోకి వెళుతున్న వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. కమిటీ గౌరవాధ్యక్షుడు కేకే రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాల్వ పల్లె అంజయ్య, కోశాధికారి పాటూరి రెడ్డెప్ప, సభ్యుడు శివ తదితరులున్నారు.

వైసీపీ నాయకుల అండతో ఇంటి స్థలం కబ్జా

- బాధితురాలి ఆవేదన -

చంద్రగిరి, మార్చి 26: వైసీపీ నాయకుల అండతో తన ఇంటి స్థలాన్ని బంధువులే కబ్జా చేశారని పనపాకం పంచాయతీలోని హరిజనవాడకు చెందిన టి.జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'పనపాకం లెక్కదాఖలోని సర్వే నెంబరు 123లో నా తల్లి శారద పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని ఆమె మరణానంతరం సోదరులు సురేష్, సిద్ధయ్య, తండ్రి గంగులయ్యలు 2016లో నాకు విక్రయించారు. ఇటీవల ఈ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన నా బంధువులు సుదర్శన్, వినోద్, ఎర్రమ్మ, గంగులయ్య, ధనలక్ష్మి, సంగీత, సంధ్యలు వైసీపీ నాయకుల అండతో కబ్జా చేసి, నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకుంటే నాపై దౌర్జన్యానికి దిగుతున్నారు. విద్యుత్ మీటర్ కనెక్షన్ కూడా తీసుకున్నారు. దీనిపై పంచాయతీ, విద్యుత్ అధికారులను అడిగితే వైసీపీ నాయకుల ఒత్తిడి వల్లే ఇచ్చామని చెప్పారు' అని జ్యోతి తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎన్‌ఆర్ కమ్మపల్లి అడవికి నిప్పు



రామచంద్రాపురం, మార్చి 26: మండలంలోని ఎన్‌ఆర్‌కమ్మపల్లి అడవికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టడంతో అడవి దగ్ధమవుతోంది. రాయలచెరువుపేట నుంచి అనుపల్లి వరకు పదికిలోమీటర్ల మేర విస్తరించి ఉండటంతో సమీపంలోని మామిడితోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవిలో మంటలు ఎ గసిపడుతుండటంతో చిట్టత్తూరు వరకు వ్యాపించాయి. గ్రామాల్లో ఇటీవల అడవికి నిప్పు పెట్టడం వల్ల జరిగే అనర్థాలపై అటవీశాఖ సిబ్బంది అవగాహన క ల్పించారు. అయినా మండలంలోని అడవులు ఎక్కడో ఓ చోట నెలరోజులుగా కాలుతూనే ఉన్నాయి.

అడుగు జాగా మిగలకుండా కబ్జా చేయడమేనా అభివృద్ధి!

● పులివర్తి సుధారెడ్డి

మంగళం, మార్చి 26: చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి చెవిరెడ్డి భాస్కర రెడ్డి నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. కానీ తాను తన అనుచరులతో అడుగు జాగా మిగల్చకుండా కబ్జా చేశారని. ఇదేనా అభివృద్ధి అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మంగళంలోని సప్తగిరికాలనీ పంచాయతీలో ఆమె నిర్వహించిన సమావేశానికి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెవిరెడ్డి ఎమ్మెల్యే పదవితో పాటు ప్రభుత్వంలో అనేక పదవులు అనుభవిస్తూ అడ్డదారుల్లో నియోజకవర్గ పరిధిలో భూకబ్జాలకు పాల్పడ్డారని ఇక్కడ మిగిలింది కబ్జాలు చేయడానికి ఏమీ లేక తన కొడుక్కి అవకాశం ఇచ్చి ఒంగోలులో గనులు కొల్లగొట్టడానికి మకాం మార్చాడని ఆమె ఆరోపించారు. ఈ అరాచకాలను ప్రజలు ప్రశ్నిస్తే పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. గంజాయి మత్తులో యువత పక్కదారి పడుతున్నారని, వారు మహిళలపై దాడులకు పాల్పడిన సంఘటనలు కొన్ని వెలుగులోకి వచ్చాయన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ ప్రాంతంలో ఆ తరువాత అడుగు కూడా అభివృద్ధి కనిపించడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలో 10వేల ఉద్యోగాలు వచ్చే చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సప్తగిరి కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాబాషా, మహిళా నాయకులు దేవిక, వెంకటసుబ్బమ్మ, మహేశ్వరి, విమల, హేమలత, లక్ష్మీప్రసన్న, చెంచు లక్ష్మీ, నాయకులు సుబ్బయాదవ్, హరికృష్ణ, నారాయణ, గోపాల్‌యాదవ్, నారాయణ, నాగభూషణం, గో పి, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

పండ్లకు కవర్లు కట్టాల్సిన సమయం ఇదే

రామచంద్రాపురం, మార్చి 26: పండ్లకు కవర్లు కట్టాల్సిన సమయం ఇదేనని ఉద్యాశాఖ అధికారి తెలిపారు. ఆర్‌సీపురం మండలం మిట్టూరులో మామిడితోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పూత ఆశించినంత లేదని కేవలం 25 శాతం నుంచి 30శాతం వరకు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం మామిడిలో తేనెమంచు పురుగు ఉందని, దాని నివారణకు వాడాల్సిన మందులను వివరించారు. కవర్లు కట్టడం వలన నాణ్యమైన పండ్లను పొందవచ్చన్నారు. ఫ్రూట్ కవర్లు కావాల్సిన రైతులు సమాచారం కోసం సమీపంలోని ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు.

సమాజ నిర్మాణంలో లాయర్ల పాత్ర కీలకం

● సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్



జస్టిస్ చంద్రచూడ్ దంపతులను సత్కరిస్తున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తదితరులు

తిరుపతి (కల్చరల్), మార్చి 26: సమాజ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో విలువైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ అన్నారు.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో ఐదు సంవత్సరాల లా కోర్సు ప్రారంభించి దశాబ్ది కాలమైన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆయన మంగళవారం ఉదయం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. అనేక వైరుధ్యాలతో కూడుకున్న భారత సమాజంలో అన్యాయం జరిగిన వారికి న్యాయం అందించడం ఎంతో సంయమనంతో చేయవలసిన పని అన్నారు. ఇపుడు విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సుతో లా విభాగంలో కూడా చాలా మార్పులు వస్తాయని, వాటిని కొత్త తరం న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని సూచించారు.తన తండ్రి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై. బి. చంద్రచూడ్ ఎస్వీ యూనివర్శిటీకి 1982మార్చిలో వచ్చారని గుర్తు చేసుకున్నారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక కుటుంబానికి పెద్ద లాంటి వ్యక్తిగా అర్థం చేసుకోవాలని ,వివిధ రాష్ట్రాల, వివిధ న్యాయశాస్త్ర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయమూర్తులతో కొలీజియం వ్యవస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. తాము విశ్రాంతిగా కాఫీ తాగే సమయంలో కూడా తమ భుజస్కంధాలపై ఎంతటి బాధ్యతలు వున్నాయో గుర్తు చేసుకుంటూ వుంటామన్నారు. నేషనల్ లా యూనివర్సిటీల్లో చదివినవారే మాత్రమే గొప్పగా రాణిస్తారని అనుకోవడం నిజం కాదని, ఎస్వీయూలో చదివినా కృషితో మంచి న్యా యాన్ని సమాజానికి అందించవచ్చునని తెలిపారు.ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఓ. మహ్మద్ హుసేన్, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జి. పద్మనాభం, డీన్ కృష్ణయ్య, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు, మహిళా విశ్వ విద్యాలయ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, జిల్లా అధికారులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు బంగారు భవిష్యత్తు


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చంద్రగిరి, మార్చి 26: టీడీపీతోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు టీడీపీ యువనేత పులివర్తి వినీల్ అన్నారు. మంగళవారం దోర్నకంబాల పంచాయతీలో మీఇంటికి మీపులివర్తి నాని, బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు తన తండ్రి కృషి చేస్తారని చెప్పారు. ఈఎన్నిక ల్లో తనతండ్రిని ఆదరించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, నాయకులు లోకేష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగభూషణం, బీగాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ, మల్లయ్యపల్లెలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మంగళవారం మల్లయ్యపల్లెకి చెందిన వైసీపీ నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్, యువరాజ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, రవియాదవ్, మితిలేష్, వీరితోపాటు మరో ఏడు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి పులివర్తి వినీల్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బాలాలయంతో సూర్యపూజోత్సవాల రద్దు

● 60 ఏళ్ల తరువాత ఇది రెండో సారి


నాగలాపురం వేదనారాయణ స్వామి ఆలయం

నాగలాపురం, మార్చి 26: వేదనారాయణ స్వామి ఆలయంలో ప్రతీ ఏటా మార్చిలో 5 రోజుల పాటు జరిగే సూర్య పూజ మహోత్సవాలు 60 ఏళ్ల తరువాత రెండో సారి ఈ ఏడాది బాలాలయంతో రద్దయ్యింది. 1967వ సంవత్సరం సెప్టెంబరు 24న ఈ ఆలయం టీటీడీ ఆధీనంలోకి వచ్చింది. టీటీడీకి చెందిన ఈ ఆలయంలో ప్రతీ ఏటా మార్చి నెల 23, 24వ తేదీల్లో సూర్య పూజ మహోత్సవాలు జరగడం ఆనవాయితీ. 5 రోజులు పాటూ జరిగే ఈ ఉత్సవాల్లో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సూర్యకిరణాలు ఆకాశ నుంచి నేరుగా రాజగోపురం మార్గం ద్వారా గర్భాలయంలోకి ప్రవేశించి స్వామి వారిపై పడతాయి. అయితే గత సంవత్సరం డిసెంబరు నెలలో ఆలయంలో బాలాలయం పనులు ప్రారంభించి పనులు జరుగుతుండడంతో ఈ ఏట సూర్యపూజ మహోత్సవాలు రద్దయినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. 60 ఏళ్ల ముందు 1973లో ఈ ఆలయంలో బాలాలయంతో సూర్యపూజ మహోత్సవాలు రద్దయి నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దీంతో 60 ఏళ్ల తరువాత రెండో సారి బాలాలయంతో సూర్య పూజ మహోత్సవాలు రద్దయినట్లు ఆలయాధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యం కేసులో ఒకరికి రిమాండ్

● పరారీలో మరో నిందితుడు

నాగలాపురం, మార్చి 26: మండల పరిధిలోని వజ్జావారి కండ్రిగ గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఓ వైసీపీ నాయకుడి కారులో అక్రమంగా తరలిస్తున్న 60 కేసుల కర్ణాటక మద్యం పట్టుబడిని విషయం తెలిసిందే. దీనికి సంబంధించి నాగలాపురం ఎస్ఈబీ సీఐ గోపీకృష్ణ తెలిపిన వివరాల మేరకు... నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు చిరంజీవికి సంబంధించిన కారును పిచ్చాటూరు మండలం నీరువాయికి చెందిన దినేష్ అనే అతను అద్దెకు తీసుకుని కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో పట్టుకున్నామన్నారు. ఆ సమయంలో కారులో ఉన్న నాగలాపురం పడమటి దళిత వాడకు చెందిన వైసీపీ కార్యకర్త సుకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నిందితుడు దినేష్ పరారీలో ఉన్నాడన్నారు.మద్యం అక్రమ రవాణాపై సోమవారం రాత్రి కేసునమోదు చేసి సుకుమార్‌ని రిమాండ్ నిమిత్తం సత్యవేడు సబ్‌జైలుకు తరలించామన్నారు. పరారీలో ఉన్న దినేష్‌ను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నామని, దినేష్ పట్టుబడిన వెంటనే ఈ మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన మరి కొంతమందిని అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

మద్యం అక్రమ రవాణా కేసులో అనుమానాలెన్నో ..

ఈ కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులో జరిగిన సంఘటనలకు, అధికారులు చెబుతున్న సమాధానానికి పొంతనం లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం రాత్రి పట్టుబడిన మద్యం అక్రమ రవాణా కేసులో సోమవారం రాత్రి వరకు ఎస్ఈబీ అధికారులు ఇటు కేసునమోదు చేయకుండా.. అటు మీడియాకు వివరాలకు వెల్లడించక పోవడంతో పలు అనుమానాలకు తావు తీసింది. ఈ కేసులో ఉన్న అధికార పార్టీకి చెందిన నాయకుడిని విడిపించేందుకు జిల్లాకి చెందిన కీలక నేత సహాయంతో వైసీపీ నాయకులు మంతనాలు జరుపుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన విషయం ఎట్టికేలకు నిజమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రవాణాలో అతడికి ఎటువంటి సంబంధం లేదంటూ ఎస్ఈబీ అధికారులు మీడియాకు వెల్లడించడం గమనార్హం. కాగా ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ కీలక నేత నియోజకవర్గం నుంచి కర్ణాటక మద్యాన్ని సత్యవేడు నియోజక వర్గంలోని 7 మండలాలకు తరలించి పలుచోట్ల డంప్ చేస్తున్నట్లు ప్రతి పక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నిల అధికారులు ఈ విషయంపై గట్టి నిఘా పెట్టి లోతుగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

2, 3 తేదీల్లో పుంగనూరు గంగజాతర

తొలిచాటింపు వేసిన తోటికులస్తులు


సుగుటూరు గంగమ్మ

పుంగనూరు, మార్చి 26: పుంగనూరులో ఏప్రిల్ 2, 3 తేదీల్లో జరిగే సుగుటూరు గంగమ్మ జాతరకు సంబంధించి జమిందారీ కుటుంబీకుల సమక్షంలో తోటికులస్తులు మంగళవారం రాత్రి తొలి చాటింపు వేశారు. స్థానిక నగిరిలోని ప్యాలెస్‌లో జమిందారీ వంశస్తులు సోమశేఖర్‌రాయల్, మల్లికార్జునరాయల్, వీరేంద్రరాయల్‌లు జాతర నిర్వహణపై పట్టణ ప్రముఖులు, పెద్దలు, తోటి, బెస్తకులస్తులు, అధికారులతో చర్చించారు. ఏటా జాతర రోజుకు ముందు వచ్చే మంగళవారం రాత్రి ప్యాలెస్ వద్ద తొలి చాటింపును తోటికులస్తులు వేస్తారు. రెండో చాటింపు ఈనెల 29న, మూడో చాటింపు జాతర జరిగే వచ్చేనెల 2న ఉంటుంది. ఆ రోజున గంగమ్మను ప్యాలెస్ నుంచి బయటకు తెచ్చి తొలిపూజ, భక్తుల దర్శనం, ఊరేగింపు ఉంటుంది. 3న ఊరేగింపు, నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. కాగా, జాతర ఏర్పాట్లు, పార్కింగ్, పారిశుధ్యం, తాగునీరు, దుకాణాలు, గొర్రెల సంత తదితర విషయాలపై పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆయనవెంట సీఐ రాఘవరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, వారి సిబ్బంది ఉన్నారు.

రూ.4 కోట్లు మోసం చేసిన ఘరానా దొంగ అరెస్టు

పీలేరు, మార్చి 26: ఏడాది కాలంలో రెట్టింపు సొమ్ము చెల్లిస్తామని పీలేరు పట్టణ వాసులకు సుమారు రూ.4 కోట్ల మేర మోసం చేసిన ఘరానా మోసగాడిని పీలేరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి కథనం మేరకు నంద్యాల పట్టణంలో ఉంటున్న కర్నూలు జిల్లా బండి ఆత్మకూరు మండలానికి చెందిన ఇనపరాళ్ల బాలన్న అలియాస్ బాలరాజు (40), ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన ఐజాక్ స్నేహితులు. వీరిద్దరూ తాము విన్ ఇండియా ఆయుర్వేదిక్ కాస్మొటిక్స్ అండ్ జనరల్ స్టోర్స్, మహిమ ఆయుర్వేదం అనే రెండు సంస్థలకు ఎండీలమని 2023 మార్చి నెల నుంచి పీలేరుకు చెందిన పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. తమ సంస్థల్లో రూ.లక్ష డిపాజిట్ చేస్తే 20 వారాలకు రూ.1.80 లక్షలు చెల్లిస్తామని నమ్మించి పీలేరుకు చెందిన ఉపాధ్యాయులు మల్లికార్జున, మురళి, ఖాదర్‌వల్లీలతోపాటు వారి బంధువుల వద్ద నుంచి సుమారు రూ.77 లక్షల వరకు డిపాజిట్లు సేకరించారు. అంతేకాకుండా ఇంకో 50 మంది వద్ద నుంచి కూడా మరో రూ.8 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించారు. మొదట్లో రూ.4 కోట్ల వరకు చెల్లింపులు చేసిన బాలన్న, ఐజాక్‌లు ఆ తరువాతి కాలంలో చెల్లింపులు చేయకపోవడం, తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో తాము మోసపోయిన సంగతి తెలుసుకున్న డిపాజిటర్లు పోలీసులను ఆశ్రయించారు. ఎక్కువ మొత్తం చెల్లించిన ఉపాధ్యాయుడు ఖాదర్‌వల్లీ ఈనెల 9వ తేదీ పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదుతో విచారణ ప్రారంభించిన పోలీసులు మంగళవారం ఉదయం పీలేరులో అరెస్టు చేశారు. అతడిని విచారించిన తరువాత రూ.35 లక్షల బ్యాంకు ఖాతా, ఒక ఫార్చ్యునర్ కారు, సెల్‌ఫోను, రూ.2 వేల నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. డిపాజిటర్ల నుంచి సేకరించిన సొమ్ముతో బాలన్న, ఐజాక్‌లు స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు, తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు కనుగొన్నామని వివరించారు. కోర్టు అనుమతితో వాటన్నింటినీ స్వాధీనం చేసుకుని డిపాజిటుదారులకు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని, ప్రస్తుతం ఐజాక్ పరారీలో ఉన్నాడని, అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ కేసును త్వరితగతిన విచారించి పురోగతి సాధించిన తనను, పీలేరు ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది రామచంద్ర, విజయ్, జగదీష్‌లను రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అభినందించారని సీఐ తెలిపారు.

తండ్రి మృతి దుఃఖాన్ని దిగమింగి..!

● టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థి



ఐరాల, మార్చి 26: తన ఉన్నతికి బాటలు పరుస్తున్న తండ్రి విగతజీవుడిగా మారారు. తండ్రి మృతదేహాన్ని చూసి కుమిలిపోయిన విద్యార్థి.. దుఃఖాన్ని దిగమింగి టెన్త్ పరీక్ష రాశారు. ఈ ఘటన మంగళవారం ఐరాలలో చోటచేసుకుంది. వీఎస్ అగ్రహారానికి చెందిన చలపతి(43) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇతడికి భార్య, కుమారుడు సంతోష్, కుమార్తె నిత్య ఉన్నారు. చలపతికి ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందారు. తండ్రి మరణంతో తల్లడిల్లిన సంతోష్.. ఆయన కలలు నెరవేర్చేందుకని వేదనను దిగమింగారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం టెన్త్ పరీక్ష రాశారు. ఆ తర్వాత ఇంటికి చేరుకుని తండ్రి అంత్యక్రియలు పూర్తి చేశాడు. ఈ విషాద ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

టెన్త్ పరీక్ష రాసిన కుమార్తెను తీసుకొస్తూ..!

● ట్రాక్టర్‌పై నుంచి జారిపడి తండ్రి మృతి


మహేంద్ర (ఫైల్‌ఫోటో)

గంగాధరనెల్లూరు, మార్చి 26: పదో తరగతి పరీక్ష రాసిన కుమార్తెను ఇంటికి తీసుకొచ్చే క్రమంలో జరిగిన ప్రమాదంలో మహేంద్రన్(45) మృతిచెందారు. గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ వి.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడకు చెందిన మహేంద్రన్(45) డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇతడికి భార్య మలర్, కుమార్తెలు హరిత, మమత, చంద్రప్రియ, కుమారుడు ప్రేమ్‌కుమార్ ఉన్నారు. ఈయన రెండో కుమార్తె మంగళవారం గంగాధరనెల్లూరు హైస్కూల్లో పదో తరగతి పరీక్ష రాశారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లేందుకు రోడ్డుపై ఉన్నారు. సిద్దేశ్వరకొండకు చెందిన భాస్కర్ చిత్తూరు నుంచి ట్రాక్టర్‌తో స్వగ్రామానికి వస్తుండగా ఆపి.. మహేంద్రన్‌తో పాటు పరీక్షకు హాజరైన పలువురు విద్యార్థులు ఎక్కారు. వీరిలో ట్రాక్టర్ ఇంజిన్ పైన డ్రైవర్ పక్కన మహేంద్రన్ కూర్చోగా, విద్యార్థులందరూ ట్రాలీలో ఎక్కారు. ద్వారకానగరం వద్ద మహేంద్రన్ కాలుజారి తారురోడ్డుపై పడ్డారు. ఆయన తలకు తీవ్రగాయంతో పాటు ట్రాలీ టైరు తలపై ఎక్కిదిగడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాలీలో ఉన్న ఆయన కుమార్తె మమతతో పాటు మిగిలిన విద్యార్థులు కేకలు పెట్టారు. ప్రమాదంపై మృతుడి భార్య మలర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.

దండెత్తిన దళారీలు...!

ముక్కంటి ఆలయ నిర్వహణపై ఆగని విమర్శలు


కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు

శ్రీకాళహస్తి, మార్చి 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంపై దళారీలు దండెత్తారు. తాము అధికారంలోకొస్తే దళారీ వ్యవస్థను సమూలంగా నిర్మూలిస్తామని వైసీపీ నేతలు ప్రకటించారు. తీరా పాలన చేతికొచ్చాక ఉచిత సేవకుల ముసుగులో అయిన వారందరినీ ఆలయం మీదకు వదిలారు. పీఆర్వో కార్యాలయంలో సుమారు వంద మంది ప్రైవేటు వ్యక్తులు వైట్ కలర్ దందాలకు తెర తీశారు. గత ఐదేళ్ల నుంచి సాగిన ఇలాంటి విధానాలపై స్థానికులు, భక్తులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్న విషయం తెలిసిందే. రాహుకేతు పూజలకు ప్రసిద్ధి చెందడంతో భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ప్రతిరోజు సంఘటన 20 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుంటారు. వారాంతపు సెలవులు, పర్వదినాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. ప్రత్యేకించి ముక్కంటి ఆలయంలో అంతరాలయ దర్శనం కోసం భక్తులు విశేషంగా ఆసక్తి చూపుతుంటారు. ఇక అమ్మవారి సన్నిధిలో మూలమూర్తి పాదాల చెంత జగద్గురు ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రం ఉంటుంది. అంతరాలయ ప్రవేశంతో దర్శించుకోవచ్చని భక్తులు విశేషంగా ఆసక్తి చూపుతారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్నీ ప్రధాన ఆలయాల్లో అంతరాలయ దర్శనం కోసం ప్రత్యేక టికెట్లు కేటాయించారు. కానీ శ్రీకాళహస్తిలో మాత్రం అంతరాలయ దర్శనం కోసం టికెట్టు విధానం అమలు కావడం లేదు. దాంతో దళార్లకు ఇది పెద్ద వరంగా మారింది. రద్దీ వేళలోనూ అడ్డదారిలో నేరుగా దర్శనాలకు తీసుకువెళ్లడం... అంతరాలయ దర్శనం చేయించడంతో దళారీలకు కాసుల వర్షం కురుస్తుంది. ఇలాంటి అడ్డదారి దర్శనాల కారణంగా సామాన్య భక్తులు క్యూ లైన్‌లో గంటల తరబడి నిలిచిపోతున్నారు. అంతేకాకుండా సామాన్య భక్తులకు దూరం నుంచి మాత్రమే దర్శనం లభిస్తుంది. ఇక కొందరు ఆలయ పరిసరాల్లో మాటువేసి భక్తులను పలు రకాలుగా మోసం చేస్తుంటారు. దీంతో చాలాకాలంగా ఆలయం వద్ద దళారీ వ్యవస్థను అరికట్టాలంటూ స్థానికులు, భక్తుల నుంచి ఆవేదన వ్యక్తం అవుతూనే ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ నేతలు ఆలయంలో దళారీ వ్యవస్థను అరికట్టేస్తామంటూ ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక దళార్లకు వైట్ కాలర్లు తొడిగి ఆలయంలో ఆలయంలో కూర్చోబెట్టారు. ఇక్కడ అంతరాలయ దర్శనానికి పెద్ద డిమాండ్ ఉంది. ఇది అదునుగా భావించిన పాలకులు సరికొత్త మార్గం ఎంచుకున్నారు. ఆలయంలోని పీఆర్వో కార్యాలయం ద్వారా ప్రముఖులకు ప్రోటోకాల్ దర్శనాలు ఏర్పాటు చేస్తుంటారు. సరిగ్గా ఇదే కార్యాలయాన్ని దళార్ల అడ్డాగా మార్చేశారు. వైసీపీకి అయిన వారిని పీఆర్వో కార్యాలయంలో ఉచిత సేవకులుగా నియమించారు. అక్కడి నుంచి వారు దర్శనాలు మాత్రం తిప్పుకునేలా రెడ్ కార్పెట్ వేశారు. ఆలయంలో వీరు మరెక్కడా పనిచేయరు. ఐదేళ్ల నుంచి అలా సుమారు వంద మంది ఉచిత సేవకులు పీఆర్వో కార్యాలయంలో తిష్ఠ వేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో రెండేళ్ల కిత్రం వైట్ కాలర్ దళారీలు అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖ అధికారులు. ఉచిత సేవకులను ఆలయంలోకి అనుమతించ కూడదంటూ హెచ్చరించారు. దాంతో కొద్ది రోజులపాటు అందరిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఆ తర్వాత మళ్లీ యథా రాజా... తథా ప్రజా అన్న చందంగా తిరిగి అందరిని మళ్లీ అనుమతించారు. మొత్తంగా ఈ ఐదేళ్లలో వైసీపీ పాలనలో ముక్కంటి ఆలయంపై దళారీలు దండెత్తారని స్థానిక ప్రజల్లో బలమైన వ్యతిరేకత కలిగించే అంశంగా నిలిచింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కూడా పలుమార్లు వైసీపీ పాలనలో ఆలయ నిర్వహణ గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బంది కలిగించే అక్రమ వ్యవస్థలను మాత్రం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్షాళన చేస్తానని ప్రజలకు గట్టిగా ఆయన హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చేతిబోర్ల మరమ్మతులు 24గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి ఎద్దడి, ఉపాధిహామీ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి బోర్ల మరమ్మతులకు 15వ ఆర్థికసంఘం నిధులు వాడుకోవాలని తెలిపారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మనుషులకే కాక పశుపక్షాదులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వందరోజులు పనిదినాలు కల్పించాలన్నారు. నీటి సరఫరా సమస్యలపై జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్‌రూమ్ (0877-2236007)కు అందిన ఫిర్యాదులను 48 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. అలాగే వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సుకు హాజరు కాని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తాగునీటి సరఫరా అధికారి విజయకుమార్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.3.40 కోట్ల కానుకలు లభించాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. సోమవారం 78,731 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,156 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ మేరకు టీటీడీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

భక్తులకు అందుబాటులో క్రోధినామ సంవత్సర పంచాంగం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): క్రోధినామ సంవత్సర పంచాంగాన్ని టీటీడీ మంగళవారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంచింది. వీటిని తిరుపతి, తిరుమలలోని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో మంగళవారం నుంచి విక్రయాలను ప్రారంభించింది. ఈపంచాంగాన్ని రూ.75 చెల్లించి భక్తులు కొనుగోలు చేయవచ్చు. కాగా ఇతర ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురానుంది.

శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9న ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం ఘనంగా జరగనుంది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల స్వామికి వస్త్ర సమర్పణ చేస్తారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేస్తారు. శ్రీవారి ఉత్సవ మూర్తుల పక్కనే మరో పీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడు విశ్వక్సేనుల స్వామిని వేంచేపు చేసి శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. తర్వాత అర్చకులు ఉగాది ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఇక ఏప్రిల్ నెలలో 5వ తేదీన అన్నమాచార్య వర్ధంతి, 7న మాసశివరాత్రి, 8న సర్వ అమావాస్య, 11న మృత్స్యజయంతి, 17 శ్రీరామనవమి ఆస్థానం, 18 శ్రీరామపట్టాభిషేకం, 19న సర్వ ఏకాదశి, 21 నుంచి 23వ తేదీ వరకు వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.

డివైడర్ల నిర్వహణ గాలికి వదిలేస్తారా?

తిరుపతి (జీవకోన), మార్చి 26: డివైడర్ల నిర్వహణ గాలికి వదిలేస్తారా అని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో కోట్లాది రూపాయల నిధులతో రోడ్లను విస్తరించి డివైడర్లను ఏర్పాటు చేశారన్నారు. అయితే అందులో లక్షలాది రూపాయలు వెచ్చించి నాటిన మొక్కల నిర్వహణ గాలికి వదిలేయడం తగదన్నారు. ఈ ఖరీదైన మొక్కలు గుబురుగా పెరిగి యూ టర్న్‌ల వద్ద ప్రమాదాలు జరిగి ప్రయాణీకులు గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న గార్డెనింగ్ విభాగం సిబ్బందికి జీతాలు పెంచి నగరంలోని అన్ని డివైడర్ల నిర్వహణకు వినియోగించుకోవాలన్నారు. ఇక ఎండ ప్రభావంతో నగరంలోని పలు ప్రధాన రహదారులపై పశువులు, గ్రామసింహాలు రోడ్లపైకి వచ్చి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి పశువులను గోశాలకు తరలించాలని కోరారు.

3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి (కల్చరల్), మార్చి 26: తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 3వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 3వ తేదీ ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. పలు సుగంధద్రవ్యాలతో ఆలయాన్ని శుభ్రం చేయనున్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

ఎన్‌ఎస్‌యూలో ముగిసిన సదస్సు



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (రూరల్),మార్చి26: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ రిలేటెడ్ టు సాంస్క్రీట్ అండ్ కంప్యూటర్‌సైన్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయసదస్సు మంగళవారంతో ముగిసింది. అతిథిగా వచ్చిన తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆధునిక తరానికి ఆధునిక పద్ధతుల ద్వారా సంస్కృతాన్ని అందిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ రమాశ్రీ, కన్వీనర్ బి.చంద్రశేఖరం, అడిషనల్ కన్వీనర్ శ్రీధర్, అధ్యాపకులు మేరీసుజాత, నాగలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సుగుణమ్మ

అచ్చెన్నాయుడికి శుభాకాంక్షలు



అచ్చెన్నాయుడితో కంకణాల రజనీకాంత్

తిరుపతి, మార్చి26(ఆంధ్రజ్యోతి) : తన జన్మదినం సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని స్థానిక టీడీపీ నేతలు సుగుణమ్మ, దంపూరి భాస్కర్ యాదవ్, కంకణాల రజనీకాంత్‌నాయుడు, కొట్టే హేమంత్ రాయల్ తదితరులు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



సత్యనారాయణపురం సర్కిల్ వద్ద దెబ్బతిన్న రోడ్డు



సర్కిల్ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

ఆదమరిస్తే ఆస్పత్రికే..

తిరుపతి (జీవకోన), మార్చి 26: జీవకోన - సత్యనారాయణపురం సర్కిల్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. సర్కిల్ మూలన రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాత్రి సమయాల్లో వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి. అంతేగాకుండా రోడ్డు మధ్యలో చిన్నపాటి గుంత ఏర్పడింది. ఏ మాత్రం ఏమరుపాటుగా వెళ్లినా కిందపడే పరిస్థితి ఉంది. అధికారులు గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

రాజకీయ సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి ● రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించిన ఆర్డీవో



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన నిశాంత్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 26: రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే 48 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని తిరుపతి ఆర్డీవో, చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి నిశాంత్ రెడ్డి స్పష్టంచేశారు. మంగళవారం సాయంత్రం ఆయన తిరుపతిలోని తన కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన చంద్రగిరి నాయకులతో సమావేశమయ్యారు. వారికి నియమ, నిబంధనల గురించి వివరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరుగుతుంటే సి-విజిల్ యాప్ ద్వారా ఈసీకి నేరుగా తెలియజేయవచ్చన్నారు. ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారని వివరించారు.

వైసీపీకి డ్వాక్రా మహిళల ఝలక్

పిలిచినా ప్రచారాలకు దూరం

తిరుపతిక్రైం, మార్చి26: వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రారంభపు సందడి మందగించింది. జనాన్ని పోగేయడం పెద్ద సమస్యగా మారుతోంది. మంగళవారం తిరుపతి 38వ డివిజన్‌లోని కేబీ లేఅవుట్, పద్మావతి పార్కు ప్రాంతాల్లోనూ, 39వ డివిజన్‌లోని చెన్నారెడ్డి కాలనీ, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంతాల్లోనూ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, మేయర్ శిరీష, కార్పొరేటర్లు ప్రచారం చేశారు. ఈ ప్రచారానికి ఎప్పటిలా డ్వాక్రా మహిళలను పిలిచారు. 'ఎండనబడి ఈ ప్రచారాలు మాకొద్దు స్వామీ' అంటూ వాళ్లు ముఖం చాటేశారని తెలిసింది. గతంలోలా దబాయించి రప్పించే పరిస్థితి లేకపోవడంతో వైసీపీ నాయకులకు కోపాన్ని దిగమింగుకోక తప్పలేదు. వార్డుల్లో అన్ని వీధుల్లోనూ, ఇల్లిల్లూ తిరిగే నాయకులు మంగళవారం రోజు మాత్రం రెండు వీధులతో సరిపెట్టుకుని వెళ్లిపోయారు.

నేటి నుంచి జనసేన ప్రచారం



మీడియాతో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారం బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కపిలతీర్థం వెళ్లి దర్శనం చేసుకున్న తర్వాత లీలామహల్ మీదుగా జీవకోనకు చేరుకుంటామన్నారు. జీవకోన గంగమ్మ, జీవలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఉదయం 10 గంటలకు అక్కడి నుంచే ప్రచారం ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి సత్యనారాయణపురం, రాజీవ్‌గాంధీ కాలనీలో ఇంటింటా ప్రచారం చేపడతామన్నారు. తిరుపతి పవిత్రతను ఐదేళ్లలో వైసీపీ నేతలు దెబ్బతీశారన్నారు. డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ తమ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయానికి పార్టీ శ్రేణులు కట్టుబడి ఉండాలని, ఆరణి శ్రీనివాసులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, జిల్లా కార్యదర్శులు ఆనంద్, బాటసారి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, రాయలసీమ కో-ఆర్డినేటర్ ఆకుల వనజ, జిల్లా ప్రచారం కమిటీ నాయకులు దినేష్ జైన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి ఎమ్మార్‌పల్లి వైసీపీ నేత మురళీనాథ రెడ్డి



తిరుపతి, మార్చి26(ఆంధ్రజ్యోతి) : ముత్యాలరెడ్డి పల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు టీవీ.మురళీనాథరెడ్డి మంగళవారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పసుపుకండువా కప్పుకున్నారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబును ముఖ్య అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఆయనతో పాటు ముత్యాలరెడ్డి పల్లిలో మూడుసార్లు వార్డు మెంబర్‌గా ఎన్నికైన శ్రీదేవి, ఆమె భర్త సుబ్బరాయుడు, ఎల్బీ నగర్‌కు చెందిన మనోహర్ కూడా పార్టీలో చేరారు. కాగా మురళీనాథరెడ్డి కాంగ్రెస్ హయాంలో ఎస్వీ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడిగా, వైసీపీ పాలనతో పాటు టీడీపీ హయాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సీఆర్. రాజన్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దుర్గాప్రసాద్, తిరుపతి రూరల్ తెలుగుదేశం పార్టీ నేత ధనుంజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), మార్చి 26: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో బుధవారం నుంచి రాష్ట్రస్థాయి అండర్- 11, 14 స్కేటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి పి.విజయకుమారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

29న విశ్వంలో పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్

తిరుపతి(విద్య), మార్చి 26: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్ ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరగనున్న నేపథ్యంలో ఉచిత నమూనా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మోడల్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎట్టకేలకు గేటు తెరిచి ఉంచారు

శిలాఫలకానికి ముసుగేశారు





తెరిచి ఉంచిన తహసీల్దార్ కార్యాలయం గేటు - శిలాఫలకానికి ముసుగు వేసిన దృశ్యం

తిరుపతి అర్బన్, మార్చి 26: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేటును ఎట్టకేలకు తెరిచి ఉంచుతున్నారు. అలాగే ప్రధాన గుమ్మం వద్ద ఉన్న శిలాఫలకానికి ముసుగువేశారు. ఇటీవల అర్బన్ తహసీల్దార్ లేని సమయంలో కార్యాలయం ప్రధాన గేటును మూసేసేవారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు 'తహసీల్దార్ లేరు ' అని సమాధానం చెప్పే అవస్థలు ఎందుకని గేటును మూసేసేవారు. అదే సమయంలో గుమ్మం వద్ద ఉన్న శిలాఫలకంలో రాజకీయ నాయకుల పేర్లు అలాగే ఉండేవి. దీనిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన అంటూ ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు శిలాఫలకంలో రాజకీయ నాయకులు పేర్లు కనబడకుండా ముసుగువేశారు. అలాగే తహసీల్దార్ లేని సమయంలో కార్యాలయం పనివేళల్లో ప్రధాన ఇనుపగేటును తెరిచి ఉంచుతున్నారు. దీంతో అక్కడికి వచ్చే ప్రజలు తహసీల్దార్ లేకపోయినా కింది స్థాయి అధికారులతో తమ బాధలను చెప్పుకోగలుగుతున్నారు.



భవానీనగర్‌వీధిలో మురికినీరు నిల్వ

ఇదేనా 'నగరాభివృద్ధి'?

భవానీనగర్‌లో పొంగిన డ్రైనేజి

తిరుపతి(కొర్లగుంట), మార్చి 26: స్థానిక భవానీనగర్‌లోని వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో వారం రోజులుగా డ్రైనేజీ పొంగుతోంది. దీంతో ఆ మార్గం దుర్గంధంగా తయారైంది. విద్యార్థులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఇదేనా నగరాభివృద్ధి' అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పవన్‌ను కలిశాక ప్రచారంలోకి

జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్



తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పవన్ కళ్యాణ్‌ను రెండు మూడు రోజుల్లో కలుస్తామని, తర్వాతే తిరుపతిలో కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం చేపడతామని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆరణి శ్రీనివాసులును పవన్ కళ్యాణ్ తిరుపతికి పంపించడంతో ఆయన్ను గౌరవించి గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కాకపోతే తిరుపతిలో వార్డు అధ్యక్షులను మార్చేస్తామనడం, చిత్తూరు, పుత్తూరు, నగరి ప్రాంతాల నుంచి వచ్చిన వారిని కమిటీల్లో పెడతామనడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరణి శ్రీనివాసులు వైసీపీ ట్రాప్‌లో పడ్డారని అంటూ అభ్యర్థిగా ఖరారైన పది రోజుల తర్వాత ఇవాళే తన ఇంటికి, నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఇంటికి వచ్చి కలిశారన్నారు. తిరుపతిలో వైసీపీ నేతలను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం స్థానిక నాయకులకే ఉందన్నారు. కాగా తనపై తామే అచ్చేసి పంచుతున్న ఒక స్థానిక పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తున్నారని వైసీపీపై మండిపడ్డారు. తానంటే వైసీపీ నేతలకు భయమెందుకని ప్రశ్నించారు. దమ్మూ ధైర్యం వుంటే నేరుగా రాజకీయం చేయాలని, కుట్రలు చేస్తే ఊరుకోబోనని హెచ్చరించారు.

60 ప్యాకెట్ల మద్యం స్వాధీనం

తిరుపతి క్రైం, మార్చి 26: తిరుపతిలోని వెస్ట్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం పోలీసులు 60 ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్వేటినగరానికి చెందిన మధు ఎన్నికల నేపథ్యంలో నగరంలో విక్రయించడానికి మద్యం తీసుకొచ్చాడు. బ్యాగులో ఉంచుకుని అలిపిరి రోడ్డులో వెళుతుండగా అనుమానంతో వెస్ట్ సీఐ నాయక్ తన బృందంతో తనిఖీలు చేయగా పట్టుబడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

మార్వాడి యూనివర్శిటీ కోర్సులపై అవగాహన



మీడియాతో మాట్లాడుతున్న మార్వాడి యూనివర్శిటీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మార్చి 26: మార్వాడి యూనివర్శిటీ కోర్సులపై ఏపీ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్వాడి యూనివర్శిటీ అడ్మిషన్ పార్టనర్ హరికృష్ణయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమ బ్రాంచ్‌లను తిరుపతితో పాటు ఏడు ప్రధాన నగరాల్లో ప్రారంభించామన్నారు. ఇంటర్‌లో ఏ కోర్సు చేసినా తమ వద్ద అడ్మిషన్లు లభిస్తాయన్నారు. 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రాయితీ ఉంటుందన్నారు. స్థానిక ఎయిర్ బైపాస్‌రోడ్డులో బ్రాంచ్ ఉందని, ఆసక్తిగల వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. మార్వాడి యూనివర్శిటీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, వెంకట్, రాజేష్, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

నేడు ధర్మనిధి ఉపన్యాసం

తిరుపతి (కల్చరల్), మార్చి 26: పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సెమినార్ హాలులో రెవరెండ్ కటాక్షమ్మ పాల్ రాజ్ ధర్మనిధి ఉపన్యాసం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీన్ ఆచార్య సి.వాణి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ సుభాషిణి అధ్యక్షతన జరిగే సభలో ప్రముఖ కథ, నవలా రచయిత జిల్లెళ్ల బాలాజీ తెలుగు, తమిళ రచనల్లో స్త్రీ వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తారని సంచాలకులు డాక్టర్ డి.యువశ్రీ తెలిపారు.

ఏటీఎం దొంగ అరెస్టు

రూ.1.04 లక్షల స్వాధీనం



నిందితుడు ముని సుబ్రమణ్యం

తిరుపతి క్రైం, మార్చి 26: ఏటీఎంల వద్ద నగదు డ్రాచేసి ఇస్తానని నమ్మించి పలువురి ఖాతాల నుంచి నగదు కాజేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1.04 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం కందాడ గ్రామానికి చెందిన మునిసుబ్రమణ్యం జులాయిగా తిరిగేవాడు. ఏటీఎంల వద్ద కాపుకాసి వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులను నమ్మించి నగదును డ్రా చేసి ఇస్తానని నమ్మించి వారికి నగదు డ్రాచేసి ఇచ్చేవాడు. ఆ సమయంలో వారి కార్డు బదులు వేరే నకిలీ కార్డు ఇచ్చేవాడు. తర్వాత ఖాతాలను ఖాళీ చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం తిరుపతి లీలామహల్ సర్కిల్లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జయంతి అనే వృద్ధురాలి నుంచి ఏటీఎం కార్డు తీసుకుని ఆమెకు నగదు డ్రా చేసి ఇచ్చాడు. తరువాత వేరే నకిలీ కార్డును ఆమెకు ఇచ్చాడు. జయంతి కార్డు ద్వారా పలుసార్లు రూ.1.33 లక్షలు డ్రా చేసుకున్నాడు. అదే సమయంలో విషయం తెలుసుకున్న బాధితురాలు తన చేతిలో ఉన్నది నకిలీ ఏటీఎం కార్డు అని గుర్తించి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లావణ్య కేసు నమోదు చేసుకుని నిందితుడిని లీలామహల్ సర్కిల్ వద్ద అరెస్టు చేశారు. కాగా నిందితుడు ఇప్పటికే శ్రీకాళహస్తి, గాజులమండ్యం, పుత్తూరు, వడమాలపేట ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద పలువురిని మోసగించి నగదు కాజేశాడు.

పదో తరగతి పరీక్షలకు 26,421 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 26: పదో తరగతికి సంబంధించి మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 26,421 మంది విద్యార్థులు హాజరయ్యారు. 551 మంది గైర్హాజరయ్యారు. 97.95 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ చైతన్య చెప్పారు.

కర్ణాటక మద్యం కేసులో ఒకరికి రిమాండ్

● పరారీలో మరో నిందితుడు

నాగలాపురం, మార్చి 26: మండల పరిధిలోని వజ్జావారి కండ్రిగ గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఓ వైసీపీ నాయకుడి కారులో అక్రమంగా తరలిస్తున్న 60 కేసుల కర్ణాటక మద్యం పట్టుబడిని విషయం తెలిసిందే. దీనికి సంబంధించి నాగలాపురం ఎస్ఈబీ సీఐ గోపీకృష్ణ తెలిపిన వివరాల మేరకు... నాగలాపురం మండలం వినోభా నగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు చిరంజీవికి సంబంధించిన కారును పిచ్చాటూరు మండలం నీరువాయికి చెందిన దినేష్ అనే అతను అద్దెకు తీసుకుని కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో పట్టుకున్నామన్నారు. ఆ సమయంలో కారులో ఉన్న నాగలాపురం పడమటి దళిత వాడకు చెందిన వైసీపీ కార్యకర్త సుకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నిందితుడు దినేష్ పరారీలో ఉన్నాడన్నారు. మద్యం అక్రమ రవాణాపై సోమవారం రాత్రి కేసునమోదు చేసి సుకుమార్‌ని రిమాండ్ నిమిత్తం సత్యవేడు సబ్‌జైలుకు తరలించామన్నారు. పరారీలో ఉన్న దినేష్‌ను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నామని, దినేష్ పట్టుబడిన వెంటనే ఈ మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన మరి కొంతమందిని అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

● అక్రమ మద్యం రవాణా కేసులో అనుమానాలెన్నో..

ఈ కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులో జరిగిన సంఘటనలకు, అధికారులు చెబుతున్న సమాధానానికి పొంతనం లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం రాత్రి పట్టుబడిన మద్యం అక్రమ రవాణా కేసులో సోమవారం రాత్రి వరకు ఎస్ఈబీ అధికారులు ఇటు కేసునమోదు చేయకుండా.. అటు మీడియాకు వివరాలకు వెల్లడించక పోవడంతో పలు అనుమానాలకు తావు తీసింది. ఈ కేసులో ఉన్న అధికార పార్టీకి చెందిన నాయకుడిని విడిపించేందుకు జిల్లాకి చెందిన కీలక నేత సహాయంతో వైసీపీ నాయకులు మంతనాలు జరుపుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన విషయం ఎట్టికేలకు నిజమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రవాణాలో అతడికి ఎటువంటి సంబంధం లేదంటూ ఎస్ఈబీ అధికారులు మీడియాకు వెల్లడించడం గమనార్హం. కాగా ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ కీలక నేత నియోజకవర్గం నుంచి కర్ణాటక మద్యాన్ని సత్యవేడు నియోజక వర్గంలోని 7 మండలాలకు తరలించి పలుచోట్ల డంప్ చేస్తున్నట్లు ప్రతి పక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నిల అధికారులు ఈ విషయంపై గట్టి నిఘా పెట్టి లోతుగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మా భూముల్లోకి వచ్చేందుకు మీరెవరు..?

● వంక పొరంబోకు భూముల్లో ఇరువర్గాల ఘర్షణ

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు




వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై తీసిన గొయ్యి - ప్రశ్నిస్తున్న మహిళలు

రేణిగుంట, మార్చి 26: మా పంచాయతీ పరిధిలోని భూముల్లో వచ్చేందుకు మీరెవరని సీపీఎం నాయకులతో ఘర్షణకు దిగిన సంఘటన మంగళవారం వివేకానంద కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే కాల్వవంకలో పోటాపోటీగా వైసీపీ, సీపీఎం నాయకులు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నారు. ఈ విషయంపై గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో వార్తలు ప్రచురించినా రెవెన్యూ అధికారుల తీరు అనుమానాలకు దారితీస్తోంది. అయితే మరో వర్గం ఆక్రమించుకున్న స్థలాల వద్ద సీపీఎం నాయకులతో మహిళలు ఘర్షణకు దిగారు. పేదలకని చెప్పి ఒక్కో ప్లాట్‌కు రూ.1.60లక్షలు వసూలు చేస్తున్నారంటూ సీపీఎం నాయకుడు నరసింహారెడ్డిని నిలదీశారు. దీంతో అక్కడున్న మహిళలతో వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతసేపటికి ఆ ప్రాంతంలో ట్రాక్టర్ వెళ్లేందుకు వీలులేకుండా గొయ్యి తీసారు. కాల్వవంకను పోటాపోటీగా కబ్జాలు చేస్తున్నా నేపథ్యంలో తహసీల్దారు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కళత్తూరు సచివాలయంలో చోరీ యత్నం

కేవీబీపురం మార్చి26: మండలంలోని కళత్తూరు గ్రామంలో సచివాలయంలో సోమవారం రాత్రి చోరీ యత్నం జరిగినట్లు ఏఎస్ఐ లోకనాధం చెప్పారు. అయితే తాళం పగొలగొట్టి లోపలకి ప్రవేశించిన దొంగలు ఏ వస్తువులను దొంగలించలేదన్నారు. మద్యం సేవించినట్లు అనవాళ్ళున్నాయని, దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో యువకుడి మృతి

● ఎమ్మెల్యే ఆదిమూలం సంతాపం

పిచ్చాటూరు, మార్చి 26: మండలంలోని నీరువాయికి చెందిన షణ్ముగం(38)కు రెండు రోజులు క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చెన్నైలోని జీహెచ్ ఆస్పత్రికి చికిత్స కోసం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స తీసుకుంటూ బుధవారం తుదిశ్వాస వదిలారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వెళ్లి షణ్ముగం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు

తిరుమల, మార్చి26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.3.40 కోట్ల కానుకలు లభించాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. సోమవారం 78,731 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

భక్తులకు అందుబాటులో క్రోధి నామ సంవత్సర పంచాంగం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని టీటీడీ మంగళవారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంచింది. వీటిని తిరుపతి, తిరుమలలోని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో మంగళవారం నుంచి విక్రయాలను ప్రారంభించింది. రూ.75 చెల్లించి భక్తులు పంచాంగంకొనుగోలు చేయవచ్చు. ఇతర ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురానుంది.

పదో తరగతి పరీక్షలకు 26,421 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 26: పదో తరగతికి సంబంధించి మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 26,421 మంది విద్యార్థులు హాజరయ్యారు. 551 మంది గైర్హాజరయ్యారు. 97.95 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో చైతన్య చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలు

సూళ్లూరుపేట, మార్చి 26: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సివిల్ సప్లయాయ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్, సీఎస్ డీటీ ఓబయ్య కథనం మేరకు.... మండల పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలో అక్రమంగా తరలించేందుకు మినీ లారీల్లో సిద్ధంగా ఉన్న ఉన్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయాయ్ అధికారులు గుర్తించారు. చి స్వాధీనం చేసుకొన్నారు. అధికారులను చూడగానే బియ్యం లోడుతో ఉన్న రెండు వాహనాలను అక్రమార్కులు వదిలేసి పారిపోయారు. మినీ లారీల్లో ఉన్న 76 బస్తాల రేషన్ బియ్యం బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయాయ్ గోదాముకు తరలించారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.లక్ష 50వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ తెలిపారు.

బాలాలయంతో సూర్యపూజోత్సవాల రద్దు

● 60 ఏళ్లలో ఇది రెండో సారి

నాగలాపురం, మార్చి 26: వేదనారాయణ స్వామి ఆలయంలో ప్రతీ ఏటా మార్చిలో 5 రోజుల పాటు జరిగే సూర్య పూజ మహోత్సవాలు 60 ఏళ్ల తరువాత రెండో సారి ఈ ఏడాది బాలాలయంతో రద్దయ్యింది. 1967వ సంవత్సరం సెప్టెంబరు 24న ఈ ఆలయం టీటీడీ ఆధీనంలోకి వచ్చింది. టీటీడీకి చెందిన ఈ ఆలయంలో ప్రతీ ఏటా మార్చి నెల 23, 24వ తేదీల్లో సూర్యపూజ మహోత్సవాలు జరగడం ఆనవాయితీ. 5 రోజులు పాటూ జరిగే ఈ ఉత్సవాల్లో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సూర్యకిరణాలు ఆకాశ నుంచి నేరుగా రాజ గోపురం మార్గం ద్వారా గర్భాలయంలోకి ప్రవేశించి స్వామి వారిపై పడతాయి. అయితే గత సంవత్సరం డిసెంబరు నెలలో ఆలయంలో బాలాలయం పనులు ప్రారంభించి పనులు జరుగుతుండడంతో ఈ ఏట సూర్యపూజ మహోత్సవాలు రద్దయినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. 60 ఏళ్ల ముందు 1973లో ఈ ఆలయంలో బాలాలయంతో సూర్యపూజ మహోత్సవాలు రద్దయి నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దీంతో 60 ఏళ్ల తరువాత రెండో సారి బాలాలయంతో సూర్య పూజ మహోత్సవాలు రద్దయినట్లు ఆలయాధికారులు తెలిపారు.

నాగలాపురం వేదనారాయణ స్వామి ఆలయం



ప్రచారంలో వైసీపీకి అడుగడుగునా నిలదీత

ప్రచారంలో మండల కన్వీనర్‌ను అడ్డుకున్న దళిత మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 26: మండలంలోని కుక్కంబాకం గ్రామంలో మంగళవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి తీరును ఎండకడుతూ దళిత మహిళలు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. కన్వీనర్‌తో పాటు వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ నాయకులకు నిరసన శెగ తగిలింది. గంట పాటు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళిత మహిళలు మాట్లాడుతూ కుక్కంబాకం సర్వే నెంబరు 81లో 80 ఎకరాల భూమిని గత పదేళ్లుగా సాగు చేసుకుంటున్నామని, అయితే మండల పార్టీ కన్వీనర్ విద్యానాథరెడ్డి సాగు చేసుకుంటున్న భూములకు రాజకీయ పలుకుబడితో పట్టాలు ఇవ్వనీయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ సిబ్బందిచేత కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అభ్యర్థి నూతకతోటి రాజేష్, సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తానే భూ సమస్య పరిష్కరించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.



ప్రశ్నిస్తున్న మహిళలను సముదాయిస్తున్న నాయకులు

సమాజ నిర్మాణంలో లాయర్ల పాత్ర కీలకం

● సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్

తిరుపతి (కల్చరల్), మార్చి 26: సమాజ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో విలువైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ అన్నారు.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో ఐదు సంవత్సరాల లా కోర్సు ప్రారంభించి దశాబ్ది కాలమైన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆయన మంగళవారం ఉదయం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. అనేక వైరుధ్యాలతో కూడుకున్న భారత సమాజంలో అన్యాయం జరిగిన వారికి న్యాయం అందించడం ఎంతో సంయమనంతో చేయవలసిన పని అన్నారు. ఇపుడు విస్తరిస్తున్న కృత్రిమ మేథస్సుతో లా విభాగంలో కూడా చాలా మార్పులు వస్తాయని, వాటిని కొత్త తరం న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని సూచించారు.తన తండ్రి , సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై. బి. చంద్రచూడ్ ఎస్వీ యూనివర్శిటీకి 1982మార్చిలో వచ్చారని గుర్తు చేసుకున్నారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక కుటుంబానికి పెద్ద లాంటి వ్యక్తిగా అర్థం చేసుకోవాలని వివిధ రాష్ట్రాల, వివిధ న్యాయశాస్త్ర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయమూర్తులతో కొలీజియం వ్యవస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. తాము విశ్రాంతిగా కాఫీ తాగే సమయంలో కూడా తమ భుజస్కంధాలపై ఎంతటి బాధ్యతలు వున్నాయో గుర్తు చేసుకుంటూ వుంటామన్నారు.నేషనల్ లా యూనివర్సిటీల్లో చదివినవారే మాత్రమే గొప్పగా రాణిస్తారని అనుకోవడం నిజం కాదని, ఎస్వీయూలో చదివినా కృషితో మంచి న్యాయాన్ని సమాజానికి అందించవచ్చునని తెలిపారు. ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఓ. మహ్మద్ హుసేన్, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జి. పద్మనాభం, డీన్ కృష్ణయ్య, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు, మహిళా విశ్వ విద్యాలయ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, జిల్లా అధికారులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.



జస్టిస్ చంద్రచూడ్ దంపతులను సత్కరిస్తున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తదితరులు

మట్టి నమూనాలపై విద్యార్థులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 26: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆత్మ చిత్తూరు వారి ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ సంచాలకులు పుష్పంజలి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి, సిబ్బంది ప్రియాంక, బరత్, ప్రిన్సిపాల్ దామెధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ఏర్పేడు, మార్చి 26: మండలంలోని వికృతమాలకు చెందిన ఓ మహిళ పట్ల పుత్తూరు మండలం వేణుగోపాలపురానికి చెందిన సురేంద్ర అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు మంగళవారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సురేంద్రపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై మహిళ ఫిర్యాదు

ఏర్పేడు, మార్చి 26: భర్త వేధిస్తున్నాడని మండలంలోని మర్రిమంద గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మర్రిమంద గ్రామానికి చెందిన ప్రసన్న కుమారి 13 ఏళ్ల క్రితం రేణిగుంట మండలం జీవాగ్రాంకు చెందిన సుకుమార్‌ను పెళ్లి చేసుకుంది. కాగా ఆరునెలలుగా భర్త ప్రవర్తనను చూసి అనుమానించింది. మరొక మహిళతో సన్నిహిత సంబంధాలున్నాయని తెలిసి భర్తను ప్రశ్నించింది. దీంతో అతడు భార్యను వేధించడంతో ప్రసన్నకుమారి మంగళవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏర్పేడు పోలీసులు సుకుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికులకు 75శాతం ఉద్యోగవకాశాలు కల్పించాలి

వరదయ్యపాళెం, మార్చి 26: శ్రీసిటీలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు ఎంటెక్ బాబు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం వరదయ్యపాళెంలో పల గ్రామాల్లో పర్యటించి శ్రీసిటీలోని పరిశ్రమల్లో నియోజకవర్గంలోని 7మండలాల స్థానికులకు 75శాతం ఉద్యోగాలివ్వాలన్నారు.

దళితుల ఆత్మగౌరవం టీడీపీతోనే

తొట్టంబేడు, మార్చి 26: దళితుల ఆత్మగౌరవంగా బతకాలంటే టీడీపీని గెలిపించుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు చుక్కలరమేష్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని బ్రాహ్మణపల్లి, కుంటిపూడి, పాపనపల్లి, కొత్తూరు, గొల్లపల్లి, బీమవరం, జగ్గరాజుపల్లి, మాదవగిరి గ్రామాలలోని ఎస్సీకాలనీలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువత అధ్యక్షుడు చరణ్, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు గురుస్వామి, శశికుమార్, వేణుగోపాల్, దినేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చేతిబోర్ల మరమ్మతులు 24గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి ఎద్దడి, ఉపాధిహామీ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి బోర్ల మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధులు వాడుకోవాలని తెలిపారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మనుషులకే కాక పశుపక్షాదులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వందరోజులు పనిదినాలు కల్పించాలన్నారు. నీటి సరఫరా సమస్యలపై జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్‌రూమ్ (0877-2236007)కు అందిన ఫిర్యాదులను 48 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. అలాగే వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తాగునీటి సరఫరా అధికారి విజయకుమార్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి

సూళ్లూరుపేట, మార్చి 26: టీడీపీ విజయానికి అందరూ సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఇంటి వద్ద టీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్‌తో సమావేశమై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయానికి ప్రణాళికతో ముందుకు సాగుదామని నిర్ణయించారు.

ఏటీఎం దొంగ అరెస్టు

రూ.1.04 లక్షల స్వాధీనం

తిరుపతి క్రైం, మార్చి 26: ఏటీఎంల వద్ద నగదు డ్రాచేసి ఇస్తానని నమ్మించి పలువురి ఖాతాల నుంచి నగదు కాజేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1.04 లక్షలు నగదు స్వాధీనం చేసు కున్నారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం కందాడ గ్రామానికి చెందిన మునిసుబ్రహ్మణ్యం ఏటీఎంల వద్ద కాపుకాసి వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులకు నగదు డ్రాచేసి ఇచ్చేవాడు. ఆ సమయంలో వారి కార్డు బదులు నకిలీ కార్డు ఇచ్చేవాడు. తర్వాత ఖాతాలను ఖాళీ చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం తిరుపతి లీలామహల్ సర్కిల్లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జయంతి అనే వృద్ధురాలి నుంచి ఏటీఎం కార్డు తీసుకుని ఆమెకు నగదు డ్రా చేసి ఇచ్చాడు. తరువాత నకిలీ కార్డును ఆమెకు ఇచ్చాడు. జయంతి కార్డు ద్వారా పలుసార్లు రూ.1.33 లక్షలు డ్రా చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లావణ్య కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు ఇప్పటికే శ్రీకాళహస్తి, గాజులమండ్యం, పుత్తూరు, వడమాలపేట ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద పలువురిని మోసగించి నగదు కాజేశాడు.

విమానాశ్రయంలో రామ్‌చరణ్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, మార్చి 26: ప్రముఖ సినీనటుడు రామ్‌చరణ్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి రామచరణ్, సతీమణి ఉపాసన, కుమార్తె చేరుకోగా అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం వారు రోడ్డు మార్గాన తిరుమల వెళ్లారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రామ్‌చరణ్

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సూళ్లూరుపేట, మార్చి 26: అపార అనుభవం కలిగిన చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరమని పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో డేగపాలెంలో బూత్ కన్వీనర్ అమాస సతీష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతందని, రాక్షస పాలనకు బుద్ధిచెప్పి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుదిరి పెంచలయ్య, ఆలీ బాయ్, జనసేన నాయకుడు కాటయ్య పాల్గొన్నారు.

వైభవంగా అళఘునాథస్వామి రథోత్సవం

గూడూరు, మార్చి 26: స్థానిక అళఘునాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత అళఘునాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు.

శ్రీవారి ఆలయంలో 9న ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం జరగనుంది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల స్వామికి వస్త్ర సమర్పణ చేస్తారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారువాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేస్తారు. శ్రీవారి ఉత్సవమూర్తల పక్కనే మరో పీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడు విశ్వక్సేనుల స్వామిని వేంచేపు చేసి శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింప జేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఇక ఏప్రిల్ 5న అన్నమాచార్య వర్ధంతి, 7న మాసశివ రాత్రి, 8న సర్వ అమావాస్య, 11న మత్స్య జయంతి, 17 శ్రీరామనవమి ఆస్థానం, 18 శ్రీరామపట్టాభిషేకం, 19న సర్వ ఏకాదశి, 21నుంచి 23 వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు.

ప్రజాగళం రోడ్‌షోను జయప్రదం చేయండి



టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం, మార్చి 26: పుత్తూరులో బుధవారం జరగనున్న ప్రజాగళం రోడ్‌షో, బహిరంగ సభను జయప్రదం చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణవనంలోని హరి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్న చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం పుత్తూరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పాల్గొననున్న ప్రజాగళం రోడ్‌షో, బహిరంగ సభ కార్యక్రమాలకు సత్యవేడు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పుత్తూరు వార్తలు

10న శివాలయం గదుల వేలం

పుత్తూరు అర్బన్, మార్చి 26: పట్టణంలోని శివాలయానికి చెందిన ఖాళీస్థలం, గదులను నెలసరి ప్రాతిపదికన అద్దెకు ఇవ్వనున్నట్లు ఈవో రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం ఎదురుగా సర్వే నెంబర్ 192లో ఖాళీగా ఉన్న 10 సెంట్ల స్థలం, రెండు అంతస్తుల భవనం, నాలుగు దుకాణాలను మూడు సంవత్సరాల కాలపరిమితికి అద్దెకు ఇచ్చేందుకు ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు శివాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు గుడ్‌విల్ (తిరిగి ఇవ్వబడని) రూ.25 వేలు, డిపాజిట్ రూ.25 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. అలాగే కోలా పెద్దమునెమ్మ ఎండోమెంట్ స్పెసిఫైడ్ అథారిటీకి చెందిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న డోర్ నెంబర్ 15-225, 15-226 గదులకు కూడా వేలంపాట నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు గుడ్‌విల్ రూ.50 వేలు(తిరిగి ఇవ్వబడని), డిపాజిట్ రూ.25 వేలు ముందస్తుగా చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు శివాలయంలోని తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

పుత్తూరు అర్బన్, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటనకు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పుత్తూరు పట్టణంలోని కేఎన్ రోడ్డులో ఉన్న కాపువీధి జంక్షన్ వద్ద చంద్రబాబు ప్రజాగళం రోడ్‌షో నిర్వహించనున్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చిన్నరాజుకుప్పం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ వై.శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పరిశీలించారు. హెలిపాడ్ నుంచి చంద్రబాబు కాపువీధి జంక్షన్‌కు చేరుకునే రోడ్డు మార్గాన్ని సైతం పరిశీలించారు. సభ జరిగే ప్రాంతంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నిర్ణయం తీసుకున్నారు.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఇలా...

మధ్యాహ్నం 2.20 గంటలకు పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరాజుకుప్పం హెలీపాడ్‌కు చేరుకుంటారు. 2.30 నుంచి 4.00 గంటల వరకు కాపువీధి జంక్షన్ వద్ద ప్రజాగళం రోడ్‌షోలో భాగంగా సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 4.10 గంటలకు కాపువీధి జంక్షన్ నుంచి తిరుగుప్రయాణమవుతారు.



చిన్నరాజుకుప్పం హెలీపాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు



పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

వడమాలపేట, మార్చి 26: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని ఎస్బీఆర్‌పురం, ఎన్వీఆర్ కండ్రిగ, సీతారామపురం గ్రామాల్లో పుత్తూరు సీఐ ఓబులేసు, వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.

ప్రజాగళం రోడ్‌షోకు తరలిరండి

పుత్తూరు అర్బన్, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొననున్న ప్రజాగళం రోడ్‌షోకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పుత్తూరు పట్టణంలోని కాపువీధి కూడలిలో నిర్వహించనున్న రోడ్‌షో, బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. నగరి నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.



రాహు కేతు పూజలు చేసుకుంటున్న జస్టిస్ రిషికేశ్ రాయ్

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్

శ్రీకాళహస్తి, మార్చి 26: ముక్కంటి ఆలయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హృషికేష్ రాయ్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్ర లింగం వద్ద హృషికేష్ రాయ్ దంపతులు రాహు- కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 26: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తికి అభిషేకించి, నిమ్మకాయలు, పూలమాలతో అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

కాలభైరవ స్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవుడి సన్నిధిని శుద్ధి చేసి మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవుడి ఉత్సవ మూర్తిని అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

మున్సిపల్ స్థలంలో శరవేగంగా నిర్మాణం...?



నిర్మాణంలో ఉన్న గదులు

శ్రీకాళహస్తి, మార్చి 26: మున్సిపాలిటీ స్థలంలో రాత్రికి రాత్రే నిర్మాణాలు జరగడంపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున పాలన రఫరా సంఘం ఎదురుగా కూరగాయల మార్కెట్ ఉంది. మార్కెట్ ఆనుకొని జెండా చెట్టుకు పక్కనే చాలాకాలంగా ఖాళీస్థలం ఉంది. పట్టణంలో ఇది అత్యంత ఖరీదైన ప్రాంతం కావడంతో ఆ స్థలంపై చాలామంది కన్ను పడింది. గత టీడీపీ ప్రభుత్వం అందులో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా స్థలాన్ని కాపాడింది. అయితే ఇటీవల నాలుగు రోజుల నుంచి రాత్రి వేళ ఆ స్థలంలో యుద్ధ ప్రాతిపదికన గదులను నిర్మించారు. కొందరు అధికార పార్టీ నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారు అంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

స్థలం లీజుకు ఇచ్చాం

మున్సిపల్ స్థలాన్ని నెలరోజుల క్రితం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చాం. నిబంధనల ప్రకారం నిర్మాణానికి అనుమతి లభించింది. వారే గదులు నిర్మించుకుని ప్రతి నెల మున్సిపాలిటీకి అద్దె చెల్లించాలి. ఆ స్థలం కబ్జాకు గురి కాలేదు. - నారాయణరెడ్డి, ఆర్వో, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

పిచ్చాటూరు, మార్చి 26: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే బీసీలకు ప్రాధాన్యత లభించిందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మండల కేంద్రమైన పిచ్చాటూరులో నేడు బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే జయహో బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, అభిమానులకు పిలుపునిచ్చారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

టీడీపీ నేతలను కలిసిన ఆదిమూలం

సత్యవేడు, మార్చి 26: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం మండలంలోని ఎస్ఆర్ అగ్రహారం, దళవాయి అగ్రహారం తదితర ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ సీనియర్ నేతలు సుధానాయుడు, సురేఖ, ప్రదీప్, మురళి, బాల, సుబ్రమణ్యం శెట్టి, పీడీచంద్ర, శోభ, సుబ్బారావు, సత్తార్ సాహెబ్, ఖాదర్ బాష, రాజేంద్రబాబును కలుసుకుని తనకు సహకరించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ జడ్పీవైస్ ఛైర్మన్ సుందరరామిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి పరవశివం, ఎంపీటీసీ టీబీఎస్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు కొండూరు బాలరాజు, శశిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ముఖ్యగమనిక...

ప్రొద్దుటూరు సభకు సత్యవేడు బస్సులు



ప్రొద్దుటూరుకు వెళ్తున్న సత్యవేడు డిపో బస్సు

సత్యవేడు, మార్చి 26: అనంతపురం జిల్లా ప్రొద్దుటూరులో బుధవారం జరగనున్న సీఎం జగన్ సభకు జనాలను తరలించేందుకు సత్యవేడు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లాయి. ఇక్కడ నుంచి పది బస్సులు వెళ్ళాయి. ప్రధాన మార్గాల్లో నడిచే పది సర్వీసులను జగన్ సభకు వెళ్లడంతో రెండు రోజులపాటు తిరుపతి, శ్రీకాళహస్తి మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు.

కానిస్టేబుల్‌కు డీజీపీ అవార్డు



దామోదారం

కేవీబీపురం మార్చి 26: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ దామోదారం డీజీపీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ రోజు డీజీపీ ప్రకటించిన అవార్డుల్లో ఆయన సిల్వర్ పథకాన్ని అందుకోనున్నారు. దీంతో ఆయనకు కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సుధీర్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వండి

తొట్టంబేడు, మార్చి 26: అసెంబ్లీ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వండని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఉమ్మడి ఎమెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. మండలంలోని దిగువకొణతనేరి గ్రామంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి గాలి చలపతినాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, జడ్పీటీసీ తిరుమలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మురళినాయుడు, సర్పంచ్ బాలాజీనాయుడు, మునిరాజనాయుడు, కన్నలిప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లెక్కలమురళినాయుడు, పవన్, బాస్కర్‌నాయుడు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దండెత్తిన దళారీలు...!

ముక్కంటి ఆలయ నిర్వహణపై ఆగని విమర్శలు



కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు

శ్రీకాళహస్తి, మార్చి 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంపై దళారీలు దండెత్తారు. తాము అధికారంలోకొస్తే దళారీ వ్యవస్థను సమూలంగా నిర్మూలిస్తామని వైసీపీ నేతలు ప్రకటించారు. తీరా పాలన చేతికొచ్చాక ఉచిత సేవకుల ముసుగులో అయిన వారందరినీ ఆలయం మీదకు వదిలారు. పీఆర్వో కార్యాలయంలో సుమారు వంద మంది ప్రైవేటు వ్యక్తులు వైట్ కలర్ దందాలకు తెర తీశారు. గత ఐదేళ్ల నుంచి సాగిన ఇలాంటి విధానాలపై స్థానికులు, భక్తులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్న విషయం తెలిసిందే. రాహుకేతు పూజలకు ప్రసిద్ధి చెందడంతో భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ప్రతిరోజు సంఘటన 20 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుంటారు. వారాంతపు సెలవులు, పర్వదినాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. ప్రత్యేకించి ముక్కంటి ఆలయంలో అంతరాలయ దర్శనం కోసం భక్తులు విశేషంగా ఆసక్తి చూపుతుంటారు. ఇక అమ్మవారి సన్నిధిలో మూలమూర్తి పాదాల చెంత జగద్గురు ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రం ఉంటుంది. అంతరాలయ ప్రవేశంతో దర్శించుకోవచ్చని భక్తులు విశేషంగా ఆసక్తి చూపుతారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్నీ ప్రధాన ఆలయాల్లో అంతరాలయ దర్శనం కోసం ప్రత్యేక టికెట్లు కేటాయించారు. కానీ శ్రీకాళహస్తిలో మాత్రం అంతరాలయ దర్శనం కోసం టికెట్టు విధానం అమలు కావడం లేదు. దాంతో దళార్లకు ఇది పెద్ద వరంగా మారింది. రద్దీ వేళలోనూ అడ్డదారిలో నేరుగా దర్శనాలకు తీసుకువెళ్లడం... అంతరాలయ దర్శనం చేయించడంతో దళారీలకు కాసుల వర్షం కురుస్తుంది. ఇలాంటి అడ్డదారి దర్శనాల కారణంగా సామాన్య భక్తులు క్యూ లైన్‌లో గంటల తరబడి నిలిచిపోతున్నారు. అంతేకాకుండా సామాన్య భక్తులకు దూరం నుంచి మాత్రమే దర్శనం లభిస్తుంది. ఇక కొందరు ఆలయ పరిసరాల్లో మాటువేసి భక్తులను పలు రకాలుగా మోసం చేస్తుంటారు. దీంతో చాలా కాలంగా ఆలయం వద్ద దళారీ వ్యవస్థను అరికట్టాలంటూ స్థానికులు, భక్తుల నుంచి ఆవేదన వ్యక్తం అవుతూనే ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ నేతలు ఆలయంలో దళారీ వ్యవస్థను అరికట్టేస్తామంటూ ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక దళార్లకు వైట్ కాలర్లు తొడిగి ఆలయంలో ఆలయంలో కూర్చోబెట్టారు. ఇక్కడ అంతరాలయ దర్శనానికి పెద్ద డిమాండ్ ఉంది. ఇది అదనుగా భావించిన పాలకులు సరికొత్త మార్గం ఎంచుకున్నారు. ఆలయంలోని పీఆర్వో కార్యాలయం ద్వారా ప్రముఖులకు ప్రోటోకాల్ దర్శనాలు ఏర్పాటు చేస్తుంటారు. సరిగ్గా ఇదే కార్యాలయాన్ని దళార్ల అడ్డాగా మార్చేశారు. వైసీపీకి అయిన వారిని పీఆర్వో కార్యాలయంలో ఉచిత సేవకులుగా నియమించారు. అక్కడి నుంచి వారు దర్శనాలు మాత్రం తిప్పుకునేలా రెడ్ కార్పెట్ వేశారు. ఆలయంలో వీరు మరెక్కడా పనిచేయరు. ఐదేళ్ల నుంచి అలా సుమారు వంద మంది ఉచిత సేవకులు పీఆర్వో కార్యాలయంలో తిష్ఠ వేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో రెండేళ్ల క్రితం వైట్ కాలర్ దళారీలు అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖ అధికారులు. ఉచిత సేవకులను ఆలయంలోకి అనుమతించ కూడదంటూ హెచ్చరించారు. దాంతో కొద్దిరోజులపాటు అందరిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఆ తర్వాత మళ్లీ యథా రాజా... తథా ప్రజా అన్న చందంగా తిరిగి అందరిని మళ్లీ అనుమతించారు. మొత్తంగా ఈ ఐదేళ్లలో వైసీపీ పాలనలో ముక్కంటి ఆలయంపై దళారీలు దండేత్తారని స్థానిక ప్రజల్లో బలమైన వ్యతిరేకత కలిగించే అంశంగా నిలిచింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కూడా పలుమార్లు వైసీపీ పాలనలో ఆలయ నిర్వహణ గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బంది కలిగించే అక్రమ వ్యవస్థలను మాత్రం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్షాళన చేస్తానని ప్రజలకు గట్టిగా ఆయన హామీ ఇచ్చారు.

నాయీ బ్రాహ్మణులకు మరింత మేలు చేయండి

శ్రీకాళహస్తి, మార్చి 26: టీడీపీ మేనిఫెస్టో ద్వారా తమ సామాజికవర్గానికి మరింత మేలు చేకూర్చాలని తిరుపతి జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోటా చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సాధికార సంఖ్య రాష్ట్ర సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరికండ్రిగలో గడ్డివామి దగ్ధం



ఏర్పేడు, మార్చి 26: మండలంలోని మునగపాళెం పంచాయతీ కుమ్మరికండ్రిగ గ్రామంలో వీరయ్య అనే రైతుకు సంబంధించిన గడ్డివామి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుకు 250 గడ్డి మోపులు దగ్ధమైనట్లు రైతు వీరయ్య తెలిపాడు. స్థానికులు గుర్తించి ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చే సమయానికి గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. 250 గడ్డిమోపుల విలువ రూ.3లక్షలు ఉంటుందని బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాని వీరయ్య ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.